సాక్షి
పార్వతీపురం మన్యం

ఆదివారం । 1 । డిసెంబర్ । 2024



మహమ్మారితో తస్మాత్.. - 8లో

హెచ్ఐవీ శరీరానికి సోకితే జీవితాంతం మందులు వాడాల్సిందే. మందులు ఆపితే రోగ నిరోధక శక్తి క్షీణించి మరణానికి దారి తీస్తుంది.



'సంకల్పం'తో తరిమికొడదాం..

మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలను యువతకు వివరించి వాటిని సమాజం నుంచి తరిమికొడదామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. - 8లో



క్రీడలతో మానసిక ఉల్లాసం

జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 31వ వార్షిక జిల్లా పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం ఘనంగా ముగిసింది. - 8లో

న్యూస్‌రీల్

ధాన్యం నిల్వల్లో తేడాలుంటే చర్యలు తప్పవు : జేసీ



సుంకిలోని గోదాంలో నిల్వలను పరిశీలిస్తున్న జేసీ శోభిక

గరుగుబిల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రంలోని నిల్వల్లో తేడాలుంటే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక హెచ్చరించారు. మండలంలోని ఉల్లిభద్రలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. గ్రామ వ్యవసాయ సహాయకులకు, రైతు సేవా కేంద్రం సిబ్బందికి ధాన్యం కొనుగోలులో తీసుకోవాల్సిన అంశాలపై పలు సూచనలు, మార్గదర్శకాలు జారీ చేశారు. అనంతరం మండలంలోని సుంకి గ్రామ పరిధిలోని బఫర్ గోదాంను ఆమె తనిఖీ చేశారు. గోదాంలో ఉన్న నిల్వలకు రికార్డుల్లో ఉన్న నిల్వలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోళ్లలో అలసత్వం వహించరాదన్నారు. దళారులకు ప్రాధాన్యత నిస్తే సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. రైతులకు పూర్తి స్థాయిలో సేవలను అందించేందుకు సిబ్బంది అంకితభావంతో పని చేయాలన్నారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ తదితరులున్నారు.

గిరిజన గ్రామంలో కరక్కాయల కొనుగోలు



కుంతేసులో కరక్కాయలను కొనుగోలు చేస్తున్న జీసీసీ అధికారులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని గొయిపాక పంచాయతీలో మారుమూల గ్రామమైన కుంతేసుకు జీసీసీ అధికారులు శనివారం వెళ్లి కరక్కాయలను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా జీసీఎంఎస్ బ్రాంచ్ మేనేజర్ కృష్ణప్రసాదరావు మాట్లాడారు. అటవీ ఉత్పత్తులను గిరిజనులు తమ కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకొచ్చి విక్రయిస్తారని ఎదురు చూడకుండా నేరుగా తమ సిబ్బందితో కుంతేసు వెళ్లి కిలోకు రూ.18లు చెల్లించి మొత్తం 950 కిలోల కరక్కాయలను కొనుగోలు చేశామని చెప్పారు. ఆయన వెంట గొడాం సూపరింటెండెంట్ ఎం.సాంబశివరావు, జీసీసీ సిబ్బంది ఉన్నారు.

రెడ్ రిబ్బన్ క్లబ్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చోటు

పార్వతీపురం టౌన్: రాష్ట్ర స్థాయిలో పార్వతీపురం ప్రభుత్వ శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాలకు రెడ్ రిబ్బన్ క్లబ్‌లో చోటు దక్కింది. ఈ మేరకు ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఉత్తర్వులు పంపినట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయిలో రక్తదాన కార్యక్రమాలు, ఎయిడ్స్ అవగాహన కార్యక్రమాల్లోనూ, రెడ్ రిబ్బన్ కార్యకలాపాల్లో కళాశాల విద్యార్థులు చురుగ్గా పాల్గొని పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించడంతో ఈ గౌరవం దక్కినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఆదివారం వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా కళాశాలకు ఈ అవార్డును అమరావతిలో నిర్వాహకులు అందజేయనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఇందుకోసం కళాశాల రెడ్ రిబ్బన్ కోఆర్డినేటర్, ఎన్‌సీసీ అధికారి డీవీవీఎస్ గుప్త అమరావతి వెళ్తున్నట్లు పేర్కొన్నారు.

రామనారాయణంలో మాజీ సీజేఐ



విశ్రాంత సీజేఐ ఎన్‌వీ రమణకు జ్ఞాపికను అందజేస్తున్న ఎన్‌సీఎస్ ట్రస్టు సభ్యులు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన రామనారాయణాన్ని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఎన్‌వీ రమణ శనివారం సాయంత్రం సందర్శించారు. ఆయనకు ఎన్‌సీఎస్ ట్రస్టు సభ్యుడు నారాయణం శ్రీనివాస్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీజేఐకి ట్రస్ట్ సభ్యులు జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి అమ్మవారిని..

విజయనగరం టౌన్: నగరంలోని పైడితల్లి అమ్మవారిని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వీ రమణ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా జడ్జి బి.సాయి కల్యాణచక్రవర్తి, కలెక్టర్ డాక్టర్ బీఆర్. అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందాల్, ఆర్‌డీఓ కీర్తి, తదితరులు ఆయనకు స్వాగతం పలికారు.

క్రీడల్లో రాణిస్తున్న మన్యం బిడ్డలు

వారంతా వ్యవసాయ, కార్మిక కుటుంబాలకు చెందిన పిల్లలు. శారీరక కష్టం వారికి నిత్యకృత్యం. ఇప్పుడు ఆ శ్రమనే ఆయుధంగా మలచుకుని కోచ్‌ల వద్ద వివిధ ఆటల్లో రాటుదేరుతున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాల పంట పండిస్తున్నారు. క్రీడా వేదికలపై రాష్ట్రంలోనే మారుమూలన ఉన్న పార్వతీపురం మన్యం జిల్లా పేరును ఇనుమడింపజేస్తున్నారు. వివిధ ఆటల్లో రాణిస్తున్న మన్యం బిడ్డల విజయగాథలకు 'సాక్షి' అక్షరరూపం.

– వీరఘట్టం/సీతంపేట/గుమ్మలక్ష్మీపురం/భామిని

- శిక్షకుల ఆధ్వర్యంలో కఠోర సాధన
- ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పీడీలు
- రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు అర్హత



ఈ చిత్రంలోని విద్యార్థి పేరు తోయక పరమేష్. గుమ్మలక్ష్మీపురం మండలం కొత్తగూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. స్వగ్రామం గుమ్మలక్ష్మీపురం మండలం కొరటిగూడ. తండ్రి కృష్ణారావు, తల్లి అమరావతి వ్యవసాయ కూలీలు. ఫెన్సింగ్ క్రీడపై మక్కువ చూపుతున్న పరమేష్‌ను పాఠశాల పీడీ నిమ్మక మాధవరావు ప్రోత్సహించారు. నవంబర్ 26 నుంచి 28వ తేదీ వరకు నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 19 బాలుర విభాగం ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సాధించడంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. డిసెంబర్ 17 నుంచి 22వ తేదీ వరకు బీహార్ రాష్ట్రం పాట్నాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో తలపడనున్నాడు.



చిత్రంలోని క్రీడాకారుడి పేరు ఆరిక అభిచందు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని కొత్తగూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. కురుపాం మండలం అనంతపురానికి చెందిన అభిచందు తల్లిదండ్రులు రమ్మని, సొంబర వ్యవసాయ కూలీలు. అక్టోబర్ 23 నుంచి 25వ తేదీ వరకు నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 14 బాయ్స్ విభాగం ఫెన్సింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. నవంబర్ 12 నుంచి 16వ తేదీ వరకు జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో తలపడ్డాడు.



చిత్రంలోని విద్యార్థి పేరు ఆరిక చరణ్. గుమ్మలక్ష్మీపురం మండలంలోని కొత్తగూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. కురుపాం మండలం కోనపాడు గ్రామానికి చెందిన చరణ్ తల్లిదండ్రులు సుకుమారి, కేదారు వ్యవసాయ కూలీలు. అక్టోబర్ 27 నుంచి 29 వరకు గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ అండర్-14 విభాగం బాలుర పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనపర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మహాసముంద్‌లో నవంబర్ 25 నుంచి 29వ తరకు జరిగిన హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాడు.

క్రీడల్లో రాణిస్తున్న కూలిబిడ్డ



భామిని మండలం దిమ్మిడిజోలకు చెందిన పాలక స్రవంతి ఏపీ మోడల్ స్కూల్‌లో ద్వితీయ బైపీసీ చదువుతూ ఉష్ క్రీడలో రాణిస్తోంది. వ్యవసాయ కూలీలైన పాలక మోహనరావు కుమార్తె స్రవంతి రాష్ట్ర స్థాయి అండర్-17 ఉష్ వ్యక్తిగత క్రీడా పోటీల్లో విజేతగా నిలిచి జాతీయ స్థాయిపోటీలకు అర్హత సాధించింది. గత నెలలో జమ్మూకశ్మీర్‌లో జరిగిన పోటీల్లో తలపడి ప్రతిభ చూపినట్లు పీఈటీ శివరామప్రసాద్ తెలిపారు.

సండే స్పెషల్

సత్తాచూపుతున్న ఆటో డ్రైవర్ కొడుకు



వీరఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న అరవలి సాత్విక్ వాలీబాల్ ఆటలో సత్తా చూపుతున్నాడు. భోగాపురంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ వాలీబాల్ పోటీల్లో రాణించి బెంగుళూరులో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. అక్కడి పోటీల్లో సత్తా చాటేందుకు శిక్షణ పొందుతున్నాడు. క్రీడాకారుడి తండ్రి గోవింద్ ఆటో డ్రైవర్. సాత్విక్ ఆర్థిక పరిస్థితిని గమనించిన హెచ్ఎం బిడ్డిక సొంబర, పీడీ శిర్లాపు ఉమామహేశ్వరరావు ఆటల్లో పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక సాయం చేస్తున్నారు.

ట్రిపుల్ జంప్‌లో సమిత దూకుడు



సీతంపేట గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న బిల్లగూడ కాలనీకి చెందిన సమితది నిరుపేద కుటుంబం. తల్లిదండ్రులు ఎస్.బెన్నయ్య, అశ్వినులకు కొండపోడు వ్యవసాయం చేస్తూ పాపను చదివిస్తున్నారు. సమిత ఓ వైపు చదువుతో పాటు ట్రిపుల్ జంప్‌లో ప్రతిభ చూపడంతో పీడీ శైలజ మెలకువలు నేర్పారు. హెచ్ఎం వసంతలక్ష్మి, హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల, ఉపాధ్యాయులు ఆర్థిక ప్రోత్సాహం అందజేయడంతో లక్నోలో నవంబర్ 26 నుంచి 30వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ట్రిపుల్ జంప్‌లో తలపడింది. జాతీయస్థాయిలో క్రీడల్లో కుమార్తె రాణించడంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ స్థాయిలో కబడ్డీ కూత



భామిని మండలం కడంబసింగి గిరిజన గూడకు చెందిన ఆదివాసీ గిరిజన పుత్రిక ఆరిక రిబిక భామిని ఏపీ మోడల్ స్కూల్‌లో బైపీసీ సెకెండ్ ఇయర్ చదువుతోంది. రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 బాలికల కబడ్డీ పోటీల్లో రాణించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. డిసెంబర్ 4వ తేదీ నుంచి హర్యానా రాష్ట్రంలోని బివానీ గ్రామంలో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు సన్నద్ధమవుతోంది. కుమార్తె ఆటల్లో రాణించడంతో తల్లిదండ్రులు ఆరిక మచ్చ, నిర్మల దంపతులు మురిసిపోతున్నారు. రిబిక జిల్లాకు పేరు తెస్తుందని స్కూల్ పీఈటీ గొర్లె శివరామప్రసాద్, ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ అన్నారు.

● ఉద్యోగ భద్రత కోసం భిక్షాటన



డీఎస్సీ నుంచి తమ పోస్టులను మినహాయించి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు ముఖ్యమంత్రి చంద్రబాబును వేడుకొన్నారు. ఐటీడీఏ కార్యాలయం అడవి తల్లి విగ్రహం ఎదుట ప్రభుత్వ తీరును నిరసిస్తూ శనివారం భిక్షాటన నిర్వహించారు. గిరిజన సంక్షేమ రాష్ట్ర అధికారులు ఇచ్చిన ఉత్తర్వులు తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం ఇవ్వాలని, తమను కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు, అధ్యాపకులుగా గుర్తించాలని కోరారు. ముందుగా దీక్ష శిబిరం వద్ద గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు దివాకర్, రమేష్, రాజేష్, వెంకట్, బిందు మాధవి, లక్ష్మి, మురళి, శ్రీను, కవిత, సీత, ఉమా, జ్యోతి, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- పార్వతీపురం టౌన్

పంచాయతీ భవన నిర్మాణాలకు స్థలాలు గుర్తించండి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



పార్వతీపురం: రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్ఏ) కార్యక్రమం కింద నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు స్థలాలను గుర్తించాలని తహసీల్దార్లు, ఈఓపీఆర్‌డీలను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి ఆర్‌జీఎస్ఏ కార్యక్రమంపై జేసీ, డీజీపీఓ, డీఎల్‌డీఓ, తహసీల్దార్లు, ఈఓపీఆర్‌డీలతో కలెక్టర్ శనివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రాయోజిత కార్యక్రమమైన రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కింద జిల్లాలో 80 గ్రామ పంచాయతీ భవన నిర్మాణాల కొరకు ప్రతిపాదనలు పంపడం జరిగిందని, అవి మంజూరయ్యాయన్నారు. భవన నిర్మాణాలకు అవసరమైన స్థలాలను తక్షణం గుర్తించాలన్నారు. మండల తహసీల్దార్లు, ఈఓపీఆర్‌డీలు ప్రత్యేక దృష్టి సారించి బుధవారం నాటికి స్థలాలను గుర్తించి నివేదికను సమర్పించాలన్నారు. జేసీ, జిల్లా పంచాయతీ అధికారి, డీఎల్‌డీఓ స్థల సేకరణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని స్పష్టం చేశారు. స్థల సేకరణ పూర్తయితే రూ.32 లక్షలతో పంచాయతీ భవన నిర్మాణం కొరకు నమూనా ఉందని, ఆ విధంగా నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, డీఎల్‌డీఓ ఎస్.ఆర్.రామారావు, తహసీల్దార్లు, ఈఓపీఆర్‌డీలు తదితరులు పాల్గొన్నారు.

అపార్ నమోదులో ముందున్నాం.. : డీఈఓ



కేజీబీవీలో మధ్యాహ్న భోజనం మెనూ పరిశీలిస్తున్న డీఈఓ

గుమ్మలక్ష్మీపురం: అపార్ నమోదులో జోన్‌లోనే మన్యం జిల్లా ప్రథమ స్థానంలో ఉందని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతినాయుడు తెలిపారు. జిల్లాలో విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఉపాధ్యాయినిలతో సమావేశం నిర్వహించారు. లెసన్‌ప్లాన్, డైరీలు, టీచింగ్ నోట్స్, పరీక్షల ప్రశ్న, జవాబుల పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మెరుగైన విద్యనందించేందుకు కృషి చేయాలని, వెనుకబడిన విద్యార్థుల పట్ల దృష్టి సారించాలంటూ సూచించారు. మెగా పేరెంట్స్ - టీచర్స్ మీట్‌ను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పదో తరగతి విద్యార్థుల వద్దకు వెళ్లి సబ్జెక్టుల వారీగా ఇప్పటి వరకు అయిన పాఠ్యాంశాల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం భోజనం మెనూ పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో డీఈఓ మాట్లాడారు. తల్లిదండ్రుల సహకారంతో విద్యా ప్రమాణాలు పెంచేందుకు మెగా పేరెంట్స్ - టీచర్స్ మీట్‌ను నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లాలో 10,386 మంది టెన్త్ విద్యార్థులు ఉన్నారని, వీరంతా మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. కేజీబీవీ విద్యార్థులకు పంచతంత్ర కార్యక్రమం 100 రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట ఎంఈఓలు బి.చంద్రశేఖర్, భాస్కరరావు, అప్పలనాయుడు ఉన్నారు.

వైద్యసేవలు అధ్వానం

- పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో రోగుల అవస్థలు
- పని చేయని ఎక్స్‌రే, ఈసీజీ యంత్రాలు
- సరిపడ మందుల్లేని వైనం
- వార్డుల్లో టాయిలెట్లు అధ్వానం
- రోగులకు సౌకర్యాలు శూన్యం
- రోజుకు సగటున 250 ఓపీలు, 60 ఐపీలు



ఆస్పత్రిలో చికిత్స కోసం వేచివున్న రోగులు



జిల్లా ఆస్పత్రి

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలకు వైద్య సేవలు విస్తృతంగా అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పార్వతీపురంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా ఏర్పాటు చేసింది. సకల సౌకర్యాలు కల్పించింది. రోగులకు సేవలే పరమావధిగా అవసరమైన యంత్రాలను ఏర్పాటు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం జిల్లా ఆస్పత్రి అభివృద్ధిని పూర్తిగా గాలి కొదిలేసింది. దీంతో జిల్లా ఆస్పత్రికి వచ్చే రోగులకు సరైన సేవలు అందడం లేదు. అన్ని వ్యాధులకు జిల్లా కేంద్రంలో వైద్యులు అందుబాటులో ఉన్నారంటూ వైద్య శాఖాధికారులు చెబుతుంటారు. ఆ నమ్మకంతో ఇక్కడకు వచ్చే రోగులను మెరుగైన వైద్యం కోసమంటూ వేరే ప్రాంతానికి రిఫర్ చేస్తుంటారు. వైద్యాధికారుల సమావేశాల్లో చెబుతున్న మాటలకు వాస్తవాలకు పొంతన లేకుండా పోయింది. ఆస్పత్రిలోని కొన్ని వార్డుల్లోనైతే పారిశుద్ధ్యం పరిస్థితులు చూసి రోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆస్పత్రిలో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన కొన్ని పరికరాలు పనిచేయక, అవసరమైన మందులు రోగులకు అందక ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలిసి ఆస్పత్రికి శనివారం వెళ్లిన సాక్షికి పలు ఆసక్తికర విషయాలు కనిపించాయి.

మూలన పడ్డ పరికరాలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు చేసి ఆస్పత్రికి సమకూర్చిన పరికరాలు సిబ్బంది నిర్లక్ష్యంతో మరమ్మతులకు గురయ్యాయి. జిల్లా ఆస్పత్రిలో కొన్ని వైద్య పరీక్షలకు సంబంధించిన పరికరాలు మూలనపడ్డాయి. ఎముకలకు సంబంధించి ఏవైనా ఇబ్బంది వస్తే పరీక్ష చేయాల్సిన ఎక్స్‌రే మిషన్ మరమ్మతులకు గురైందని స్వయంగా సిబ్బందే శనివారం తెలియజేశారు. ఈసీజీ మిషన్ సైతం మరమ్మతులకు గురవ్వడంతో వచ్చే రోగులకు సోమవారం పరీక్షలు చేయించుకోవాలని టెక్నీషియన్లు రోగులకు సూచిస్తున్నారు. నడవలేని రోగులను ఆస్పత్రిలోకి తీసుకువెళ్లేందుకు ఉపయోగించే వీల్ చైర్లు సైతం మరమ్మతులకు గురయ్యాయంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థమవుతోంది.

రోగులకు మందులు కరువు

జిల్లా వ్యాప్తంగా ఆస్పత్రుల్లో మందుల కొరత ఎక్కువగానే ఉంది. 104 వాహనాలు, పీహెచ్‌సీల్లో మందుల కొరత ఉండడంతో పాటు జిల్లా ఆస్పత్రిలో రోగులకు అందించేందుకు మందులు కరువయ్యాయి. చలికాలంలో అందరికీ ప్రధాన సమస్య అయిన దగ్గు వస్తే వైద్యులు యామ్‌రాక్సిల్ సిరప్ అందజేస్తారు. అటువంటి యామ్‌రాక్సిల్ సిరప్ నిల్వలు గత రెండు నెలలుగా జిల్లా ఆస్పత్రిలో అందుబాటులో లేవంటేనే మందులు ఏ రకంగా అందజేస్తున్నారో అర్థమవుతుంది. నామమాత్రంగానే మందులను రోగులకు అందజేస్తున్నారు. మిగిలిన మందులను బయట మందుల షాపుల్లో కొనుగోలు చేసుకోవాలంటూ సిబ్బంది రోగులకు సూచిస్తున్నారు.

నామమాత్రంగా డేకేర్ సెంటర్ సేవలు

పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన ప్రాంతం ఎక్కువగా ఉంది. ఎక్కువ శాతం గిరిజన విద్యార్థులు తలసేమియా, రక్తహీనతతో బాధపడుతుంటారు. ఈ విషయాన్ని గమనించిన ఐటీడీఏ అధికారులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో గతంలో డేకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ డే కేర్ సెంటర్‌లో విద్యార్థులకు, గిరిజన చిన్నారులకు, రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులకు సేవలందించాలి. అటువంటిది డే కేర్ సెంటర్‌లో నామమాత్రంగా సేవలు అందుతున్నాయి.

పట్టించుకోని సిబ్బంది

జిల్లా ఆస్పత్రిలో నర్సుల నిర్లక్ష్యం పూర్తి స్థాయిలో కన్పిస్తోంది. రోగుల వార్డులో నియమించిన నర్సులు రోగులను పట్టించుకోకుండా తోటి సిబ్బందితో కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. రోగులు తమ సమస్యలు చెబుతున్నా పట్టించుకోని స్థితిలో వారు ఉన్నారు. మరోవైపు ఆస్పత్రిలో జనరల్ వార్డుల్లో ఉండే మరుగుదొడ్లు పరిశుభ్రం చేయక దుర్గంధంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని బాత్‌రూంలు మరమ్మతులకు గురికావడంతో ఒకే బాత్‌రూంను వినియోగించుకోవాల్సిన పరిస్థితి నెలకొందని రోగులు వాపోతున్నారు.


అపరిశుభ్రంగా మరుగుదొడ్లు



జనరల్ వార్డులో మరుగుదొడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఎవరూ సరిగా పట్టించుకోవడం లేదు. పలుమార్లు పరిశుభ్రంగా లేదని విన్నవించుకున్నా.. చేస్తానులే అన్న సమాధానం తప్ప పరిశుభ్రపరిచిన దాఖలాలు లేవు. అధికారులు స్పందించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి.

– సంతోష్, మక్కువ, జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగి

కనీసం పట్టించుకోవడం లేదు.



నాకు మలేరియా, టైఫాయిడ్ వచ్చింది. ఆస్పత్రిలో ఇన్‌పేషంట్‌గా చేరాను. గత రెండు రోజులుగా ఆస్పత్రిలోనే ఉన్నాను. నర్సులు మాలాంటి రోగులను సరిగ్గా పట్టించుకోవడం లేదు. బాత్‌రూంలలో నీటి సౌకర్యం లేదు. పరిశుభ్రం చేయడం లేదు. అధికారులు పట్టించుకొని సమస్యను పరిష్కరించాలి.

– చినబాబు, కొత్తవలస, జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగి



పనిచేయని ఎక్స్‌రే మిషన్



మరమ్మతులకు గురైన వీల్‌చైర్



అపరిశుభ్రంగా బాత్‌రూం



పాడైన ఈసీజీ

క్లుప్తంగా

14న జాతీయ లోక్ అదాలత్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా జడ్జి బి.సాయికల్యాణ్‌చక్రవర్తి

విజయనగరం : జాతీయ లోక్ అదాలత్‌ను డిసెంబర్ 14న నిర్వహించనున్నట్లు జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి.సాయికళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఉన్న న్యాయమూర్తులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ అదాలత్‌లో రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, మోటార్ ప్రమాద బీమా కేసులు, బ్యాంకు కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మనీ కేసులు, ప్రామిసరీ నోట్ కేసులు, ఎలక్ట్రిసిటీ కేసులు, ఎక్సైజ్ కేసులు, ల్యాండ్ కేసులు, కుటుంబ తగాదాలు, వాటర్ కేసులు, మున్సిపాలిటీ కేసులు, ప్రి లిటిగేషన్ కేసులు, ఇరు పార్టీల అనుమతితో రాజీ మార్గంలో శాశ్వత పరిష్కరించడం జరుగుతుందన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు జిల్లా న్యాయ మూర్తులు ఎం.మీనాదేవి, అప్పలస్వామి, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టీవీ రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో కల్యాణికి స్వర్ణ పతకం



స్వర్ణ పతకం సాధించిన రేణుక కల్యాణిని అభినందిస్తున్న అధ్యాపక సిబ్బంది

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి ఎస్‌డీఎస్ డిగ్రీ కళాశాలకు చెందిన సాకేటి రేణుక కల్యాణి జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ మరియు పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. ఇటీవల పంజాబ్ రాష్ట్రంలో జరిగిన జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్న రేణుక కల్యాణి తన ప్రతిభను కనబరిచి స్వర్ణ పతకం సాధించింది. కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతూ ఎన్‌సీసీ విభాగంలో ప్రత్యేక శిక్షణ పొందుతూ క్రీడా పోటీల్లో అసాధారణ ప్రతిభను కనబరిచింది. కళాశాలకు చెందిన మరో విద్యార్థి జమ్ము నితీష్‌కుమార్ నవంబర్ 28, 29 తేదీలలో విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీలో జరిగిన ఖో ఖో పోటీల్లో ఆంధ్ర యూనివర్సిటీ జట్టుకు ఎంపిక అయ్యాడు. డిసెంబర్ 27 – 31 తేదీల మధ్య తిరువూరులో జరగనున్న ఖో ఖో పోటీలలో ఆంధ్ర యూనివర్సిటీ జట్టు తరఫున నితీష్ పాల్గొంటాడు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ బి.రవి, అధ్యాపకుడు సురేష్‌కుమార్, పీడీ కిరణ్ కుమార్, అధ్యాపకులు అభినందించారు.

ఏఐపై జాతీయ స్థాయి స్వల్పకాలిక శిక్షణ



కోర్సు వివరాల పోస్టర్‌ను విడుదల చేసిన యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ హ్యుమనిటీస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ శరత్ చంద్రబాబు

విజయనగరం అర్బన్: జావా ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ రియాక్ట్ జేఎస్ మరియు ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) పై జాతీయ స్థాయి స్వల్పకాలిక శిక్షణా తరగతులు స్థానిక కేంద్ర గిరిజన యూనివర్సిటీలో శనివారం ప్రారంభమయ్యాయి. ఏఐసీటీఈ, నాస్కామ్ (న్యూఢిల్లీ), బ్రెయిన్ ఓ విజన్ సహకారంతో నిర్వహించిన ఈ శిక్షణలో యూనివర్సిటీ విద్యార్థులకు, సమీప ప్రాంతాలలోని ఇంజినీరింగ్ కళాశాల ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులకు ఏఐ సాంకేతిక నైపుణ్యాలను పెంపొందిస్తారు. ఈ సందర్భంగా కోర్సుకు సంబంధించి వివరాల పోస్టర్‌ను విడుదల చేసారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ హ్యుమనిటీస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ శరత్ చంద్రబాబు, యూనివర్సిటీ వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

రాజాం సిటీ: స్థానిక శ్రీకాకుళం రోడ్డులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. రాజాం వైపు నుంచి పొందూరు వైపు వెళ్తున్న ఆటో హీరో షోరూం వద్ద రోడ్డును దాటుతున్న వ్యక్తిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతునికి సంబంధించిన ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని, వివరాలు తెలియాల్సి ఉందని ఎస్‌ఐ వై.రవికిరణ్ తెలిపారు. మృతదేహాన్ని రాజాం సామాజిక ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹220

మహమ్మారితో తస్మాత్..

- నేడు వరల్డ్ ఎయిడ్స్ డే
- హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన అవసరం
- జిల్లాలో తగ్గుతున్న ఎయిడ్స్ వ్యాప్తి
- 2023లో 372 కేసులు
- 2024లో 204 కేసులు
- ఏఆర్‌టీ కేంద్రంలో ప్రస్తుతం మందులు వాడుతున్న వారు 6,448 మంది



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో హెచ్‌ఐవీ పరీక్ష చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

విజయనగరం ఫోర్ట్: హెచ్‌ఐవీ శరీరానికి సోకితే జీవితాంతం మందులు వాడాల్సిందే. మందులు ఆపితే రోగ నిరోధక శక్తి క్షీణించి మరణానికి దారి తీస్తుంది. కాబట్టి ఈ వైరస్ వ్యాప్తి పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలి. అవగాహన కూడా అవసరం. గతంలో హెచ్‌ఐవీ సోకిన వారి పట్ల తోటివారు వివక్ష చూపేవారు. ఇప్పుడు వివక్ష చాలా వరకు తగ్గింది. ప్రజల్లో దీనిపై విస్తృతమైన అవగాహన పెరగడంతో ఈ పరిస్థితి మారింది. ఇంకా అవగాహన పెరగాల్సి ఉంది. కొందరు ఇప్పటికీ హెచ్‌ఐవీ బారిన పడుతున్నారు. ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు బానిస కావడంతో ఎక్కువగా హెచ్‌ఐవీ బారిన పడుతున్నారు. వీరిలో 35 ఏళ్లలోపు వారే ఎక్కువగా ఉండడం ఆందోళన కల్గిస్తున్న అంశం. ఈ పరిస్థితుల్లో నేడు వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా సాక్షి పాఠకులకు అందిస్తున్న ప్రత్యేక కథనం.

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని తొలిత 1998లో ప్రారంభించారు. అప్పటి నుంచి ఏటా నిర్వహిస్తున్నారు. హెచ్‌ఐవీ – ఎయిడ్స్ వ్యాధి ఉందని తెలిస్తే ఒకప్పుడు భయాందోళనలకు గురయ్యేవారు. రోగి పట్ల తీవ్రమైన వివక్ష ఉండేది. కనీసం ఆ వ్యక్తితో మాట్లాడడానికి, పక్కన కూర్చోదానికి కూడా తోటి వారు ఇష్టపడేవారు కాదు. ప్రస్తుతం ఈ విషయంలో కొంత వరకు మార్పు వచ్చింది. ఇంకా రావాల్సి ఉంది.

జిల్లాలో చికిత్స సౌకర్యాలు ఇలా..

సమగ్ర సలహా పరీక్ష కేంద్రాలు (ఐసీటీసీ)లు – 14 ఉన్నాయి. ఫెసిలిటి ఇంటిగ్రేటెడ్ ఐసీటీసీలు (పీహెచ్‌సీల్లో) 91 ఉన్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఐసీటీసీలు 20 ఉన్నాయి. రక్తసేకరణ, రవాణ వాహనం ఒకటి ఉంది. రక్తనిధి కేంద్రాలు 9, రక్త నిల్వ కేంద్రాలు 9 ఉన్నాయి. సుఖ వ్యాధుల చికిత్స కేంద్రాలు 2 ఉన్నాయి. ఏఆర్‌టీ కేంద్రాలు 2 ఉన్నాయి. ఏఆర్‌టీ ప్లస్ కేంద్రాలు 7 ఉన్నాయి. హెచ్‌ఐవీపై పని చేసే స్వచ్ఛంద సంస్థలు 7 ఉన్నాయి.

13,644 మంది హెచ్‌ఐవీ రోగులు

జిల్లాలో 2008 నుంచి ఈ ఏడాది అక్టోబర్ నెలఖారు నాటికి 13,644 మంది హెచ్‌ఐవీ రోగులు నమోదయ్యారు. వీరిలో పురుషులు 6,754 మంది, మహిళలు 6,381 మంది, పిల్లలు 509 మంది ఉన్నారు. ఏఆర్‌టీ కేంద్రంలో రిజిస్టర్ అయిన వారు 6,448 మంది. వీరిలో పురుషులు 2,650 మంది, మహిళలు 3,528 మంది, పిల్లలు 270 మంది ఉన్నారు.

2009 నుంచి 2024 అక్టోబర్ వరకు సాధారణ రోగులకు నిర్వహించిన వైద్య పరీక్షలు, హెచ్‌ఐవీ నిర్ధారణ అయిన వారి వివరాలు

సంవత్సరం	హెచ్‌ఐవీ పరీక్షలు	హెచ్‌ఐవీ రోగులు
2009–10	39,094	1818
2010–11	47,094	1683
2011–12	52,070	1200
2012–13	47,412	1060
2013–14	56,920	873
2014–15	63,022	871
2015–16	67,572	814
2016–17	73,317	701
2017–18	73,360	633
2018–19	80,343	648
2019–20	75,910	616
2020–21	41,943	329
2021–22	73,916	403
2022–23	90,231	495
2023–24	71,758	372
2024–25	42,389	204

2024లో 204 కొత్త కేసులు

2023 – 24లో 71,758 మందిని పరీక్షించగా 372 కేసులు నమోదయ్యాయి. 40,432 మంది గర్భిణులను పరీక్షించగా ఆరుగురు గర్భిణులకు హెచ్‌ఐవీ ఉన్నట్టు నిర్ధారణ అయింది. 2024 అక్టోబర్ నెలఖారు నాటికి 42,389 మందిని పరీక్షించగా 204 కొత్త కేసులు నమోదయ్యాయి. 20,191 మంది గర్భిణులను పరీక్షించగా 9 మందికి హెచ్‌ఐవీ ఉన్నట్టు నిర్ధారణ అయింది.



హెచ్‌ఐవీపై కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కౌన్సిలర్

సంవత్సరం	గర్భిణులు	హెచ్‌ఐవీ సోకిన వారు
2009–19	40,138	149
2010–11	47,227	101
2011–12	49,603	64
2012–13	41,976	47
2013–14	45,038	61
2014–15	51,369	41
2015–16	48,159	35
2016–17	50,366	30
2017–18	60,686	29
2018–19	54,952	29
2019–20	51,853	32
2020–21	13,807	14
2021–22	53,575	21
2022–23	61131	19
2023–24	40,432	06
2024–25	20,191	09

అవగాహన పెరిగింది

హెచ్‌ఐవీపై ప్రజల్లో అవగాహన పెరిగింది. దీనిపై కళాజాత బృందాలు ద్వారా అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాం. హెచ్‌ఐవీ నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలి. సత్ప్రవర్తన కల్గి ఉండడం ద్వారా హెచ్‌ఐవీ వ్యాప్తిని అరికట్టవచ్చు.



– డాక్టర్ కె.రాణి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

- పురుగుల మందు తాగిన ప్రియుడు, ప్రియురాలు
- ఆస్పత్రిలో ప్రియుడు మృతి
- చికిత్స పొందుతున్న ప్రియురాలు



మృతి చెందిన శీర పైడిరాజు



వైద్య సేవలు పొందుతున్న రామలక్ష్మి

గజపతినగరం : వివాహేతర సంబంధం ఇద్దరిని ఆత్మహత్యకు పురిగొల్పింది. ఇందులో ప్రియుడు ప్రాణం కోల్పోగా... ప్రియురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళ్తే.. గజపతినగరం మండలం మరుపల్లి గ్రామానికి చెందిన శీర పైడిరాజు(31)కు కొత్తవలస మండలానికి చెందిన బొబ్బిలి ఆదిలక్ష్మితో మూడేళ్ల కిందట వివాహమైంది. వీరి దాంపత్య జీవితంలో సంతానం కలగలేదు. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన వివాహిత సబుకు రామలక్ష్మితో పైడిరాజుకు ఎనిమిది నెలల కిందట పరిచయం ఏర్పడింది. అది వివాహేతర సంబంధానికి దారితీసింది. పైడిరాజు పురిటిపెంట సమీపంలో ఆటోను నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం పురిటిపెంట రైల్వే గేటు వద్ద వీరిద్దరూ కలిసి మాట్లాడుకున్నారు. ఏం జరిగిందో తెలియదుగాని ఇద్దరి మధ్య మాటమాట పెరిగి పురుగుల మందు సేవించి అక్కడి పడిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఇద్దరినీ విజయనగరం మహారాజ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి పైడిరాజు శనివారం మృతి చెందినట్టు తెలిపారు. రామలక్ష్మి వైద్య సేవలు పొందుతున్నట్టు చెప్పారు. మృతుడి తండ్రి శీర అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కె.లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రామలక్ష్మికి కూడా ముగ్గురు పిల్లలు ఉన్నారు.

‘సంకల్పం’తో మాదక ద్రవ్యాలను తరిమికొడదాం..

- రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న హోం మంత్రి వంగలపూడి అనిత

నెల్లిమర్ల: మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలను యువతకు వివరించి వాటిని సమాజం నుంచి తరిమికొడదామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాలపై పోరాటం చేసేందుకు ఎస్పీ వకుల్ జిందల్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంకల్పం కార్యక్రమాన్ని నెల్లిమర్ల మహారాజ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(మిమ్స్) కళాశాలలో శనివారం నిర్వహించారు. ఇందులో హోం మంత్రి అనిత ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రేపటి తరం విద్యార్థులేనని, వారిని సన్మార్గంలో నడిపించేందుకు ఎస్పీ జిందల్ చేపట్టిన సంకల్పం కార్యక్రమం అభినందనీయమన్నారు. రాష్ట్రాన్ని మాదకద్రవ్య రహితం చేయాలన్న ఉద్దేశంతో డీజీ స్థాయి పోలీసు అధికారి పర్యవేక్షణలో ప్రత్యేకంగా ఈగల్ పేరిట పోలీసు శాఖ ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ప్రారంభించిందన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు 1972 టోల్‌ఫ్రీ నంబరును కూడా ఏర్పాటు చేశామన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. డ్రగ్స్ ఫ్రీ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్స్‌గా తమ విద్యా సంస్థలను నడిపేందుకు కళాశాలల యాజమాన్యాలు చర్యలు చేపట్టాలన్నారు. చదువును ఎంజాయ్ చేస్తూ ఉండాలని, అలా చేయడం వల్ల ఒత్తిడికి దూరంగా ఉండొచ్చన్నారు. భవిష్యత్‌లో ఉత్తమ వైద్యులుగా ఎదగాలని ప్రజలకు మంచి సేవలు అందించాలని వైద్య విద్యార్థులను కోరారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ఖాళీ సమయాన్ని విజ్ఞానం పెంపొందించేందుకు వినియోగించుకోవాలన్నారు. యాంటీ డ్రగ్స్ కమిటీలు కళాశాలల్లో ఏర్పాటు చేసి డ్రగ్స్ నియంత్రణకు కృషి చేయాలన్నారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణకు తమ వంతు సహకారం పోలీసు శాఖకు అందిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ డ్రగ్స్ నియంత్రణ సమాజానికి సవాల్‌గా మారిందన్నారు. ఇప్పటికే జిల్లా పోలీసు శాఖ సంకల్పం కార్యక్రమాన్ని 350 కళాశాలల్లో నిర్వహించి 35 వేల మంది విద్యార్థులను, మరో 900కు పైగా అవగాహన సదస్సులు చేపట్టి 80 వేల మందిని మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని చైతన్యపరిచామన్నారు. డ్రగ్స్ తీవ్రమైన నేరమని అన్నారు. అనంతరం హోంమంత్రి అనిత మిమ్స్ కళాశాల యాజమాన్యానికి డ్రగ్స్ పట్ల అవగాహన కల్పించిన కళాశాలగా ధ్రువపరుస్తూ సర్టిఫికెట్‌ను కళాశాల డీన్ డాక్టర్ సీహెచ్ లక్ష్మీకుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఓఎస్‌డీ అనిల్ పులిపాటి, డీఎస్పీలు ఎం.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, ఎస్.రాఘవులు, మిమ్స్ చైర్మన్ అల్లూరి సత్యనారాయణరాజు ప్రవీణ్‌కుమార్, డీన్ సీహెచ్ లక్ష్మీకుమార్, కిమిడి నాగార్జున పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



అల్ రౌండర్‌గా నిలిచిన ఏఆర్ విభాగానికి ట్రోఫీ అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 31వ వార్షిక జిల్లా పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం ఘనంగా ముగిసాయి. కార్యక్రమానికి కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడతెరిపి లేని విధులతో ఎన్నడూ ఖాళీ లేకున్నా మానసిక, శారీరక ఒత్తిడి నుంచి ఉపశమనం పొంది, నూతనోత్సాహంతో విధులకు పునరంకితులయ్యేందుకు ఈ క్రీడా పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు ఎంతో ఉత్సాహంతో ఉద్యోగులు పాల్గొన్నారన్నారు. మానసిక, శారీరక సామర్థ్యానికి మన జీవన విధానంలో క్రీడలను ఒక అలవాటుగా మార్చుకోవాలన్నారు. పోటీల్లో ఆర్మ్‌డ్ రిజర్వు విభాగం ఆల్‌రౌండర్‌గా నిలిచింది. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహ్వానితులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ పోటీల్లో కోచ్‌గా మనోడే..

- అంతర్జాతీయ చాంపియన్‌షిప్ కోచ్‌గా హేమంత్
- ఈ నెల 7 నుంచి బెంగళూరులో ఐఏయూ ప్రపంచ పోటీలు



కోచ్‌గా ఎంపికైన కంది హేమంత్

చీపురుపల్లి: క్రీడలపై ఆ కుర్రాడికి ఉన్న ఆసక్తి ఆకాశంలో పోరాటం సాగించే సైనిక విభాగం(ఎయిర్‌ఫోర్స్)లో ఉద్యోగాన్ని సాధించే వరకు తీసుకువెళ్లింది. భారత వైమానిక దళంలో ఉద్యోగం చేస్తూనే ఇంకా ఏదో సాధించాలనే తపనతో క్రీడల్లో తన సామర్థ్యం చూపిస్తూ వచ్చాడు. క్రీడల్లో మనోడికి ఉన్న సామర్థ్యం చూసిన ఎయిర్స్‌ఫోర్స్ విభాగంలో ఉన్నత స్థాయి అధికారులు సైతం సహకారాన్ని అందించారు. అవన్నీ కలిసొచ్చి ఎక్కడో చీపురుపల్లి వంటి ప్రాంతంలో జన్మించి అంతర్జాతీయ స్థాయిలో జరిగే చాంపియన్‌షిప్ పోటీల్లో రన్నింగ్ విభాగంలో భారతదేశం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులకు కోచ్‌గా ఎదిగినంత స్థాయికి చేరుకున్నాడు. ఆయనే పట్టణంలోని కొత్తగరివిడికి చెందిన కంది హేమంత్.

డిసెంబర్ 7నుంచి ప్రపంచ చాంపియన్‌షిప్

ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ అల్ట్రా రన్నర్స్(ఐఏయూ) ఆధ్వర్యంలో బెంగళూరులో డిసెంబర్ 7 నుంచి 32వ ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. దాదాపు 50 నుంచి 60 దేశాలకు చెందిన క్రీడాకారులు ఈ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారు. ఈ పోటీల్లో 100 కి.మీ అల్ట్రా రన్నింగ్ విభాగంలో భారతదేశం నుంచి ఏడుగురు క్రీడాకారులు పాల్గొననున్నారు. అందులో ముగ్గురు ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగులు కావడం గమనార్హం. అయితే ఆ ముగ్గురు ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగులకు హేమంత్ కోచ్‌గా సపోర్ట్ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వహించనున్నాడు. ఇప్పటికే గత రెండు నెలలుగా బెంగళూరులో వారికి శిక్షణ కూడా ఇస్తున్నాడు.

కమ్యూనికేషన్‌ను పెంపొందించుకోవాలి

- జీఎస్టీ అండ్ కస్టమ్స్ కమిషనర్ రవికిరణ్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జీఎస్టీ అండ్ కస్టమ్స్ కమిషనర్ రవికిరణ్

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు కమ్యూనికేషన్‌ను పెంపొందించుకోవాలని జీఎస్టీ అండ్ కస్టమ్స్ కమిషనర్ ఈదర రవికిరణ్ అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన యూజింగ్ టెక్నాలజీ, ఏఐ ఫర్ ఎఫెక్టీవ్ లెర్నింగ్ అనే అంశాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు డిగ్రీలు ప్రధానం కాదని లెర్నింగ్ ఎంతో అవసరమన్నారు. ప్రతి ఒక్కరికి కమ్యూనికేషన్, క్రియేటీవిటీ, కాన్ఫడెన్స్, క్రిటికల్ థింకింగ్ అవసరమన్నారు. ఏదైనా అంశం గురించి తెలుసుకోవాలంటే ఇంటర్నెట్, చాట్, జీపీటీ చాలా ఉపయోగపడుతుందన్నారు. ప్రకృతిని నేడు కాపాడుకోవాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. అభివృద్ధి పేరుతో ప్రకృతిని నాశనం చేయడం వలన విపత్తులు సంభవిస్తున్నాయన్నారు. ఐక్యూఏసీ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, స్కిల్స్ డీన్లు అనిల్‌కుమార్, ఆసిఫ్, దేవికారిణి, బీటెక్, బీబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



నల్ల అప్పలనాయుడు మృతదేహం

రామభద్రపురం: విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన సంఘటన నాయుడువలస పంచాయతీ కె.పాలవలస గ్రామంలోని ఓ పొలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. బాడంగి మండలం గజరాయ నివలసకు చెందిన నల్ల అప్పలనాయుడు (58)కు రామభద్రపురం మండలం కొండపాలవలసలో పొలం ఉంది. ఆ పొలంలో సాగు చేస్తున్న కూరగాయల పంటకు యూరియా వేసేందుకు శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో భార్య సరోజినితో కలిసి అప్పలనాయుడు వెళ్లాడు. యూరియాను మొక్కలకు వేసి చేతులు కడుక్కోవడానికి నీరు లేక తన పంపు షెడ్‌లో మోటారు వేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు మోటారు స్విచ్ వేస్తూ విద్యుత్ షాక్‌కు గురై అక్కడ కింద పడిపోయాడు. గమనించిన భార్య వెళ్లి లేపగా అప్పటికే మృతి చెందాడు. అప్పటి వరకు కలిసి పనిచేసిన భర్త కళ్లముందే విగతజీవిగా మారడంతో భార్య సరోజిని బోరున విలపించింది. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వి.ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రిలో...



మహేష్ (ఫైల్)

రామభద్రపురం: తునిలో నవంబరు 26న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అంపావిల్లి మహేష్ శనివారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని కొండకెంగువ గ్రామానికి చెందిన అంపావిల్లి మహేష్, బండారు చైతన్య కలిసి ద్విచక్ర వాహనంపై ద్వారపూడిలో అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్లారు. ఆ రాత్రి 9.30 గంటల సమయంలో తుని వద్ద ఎదురుగా వస్తున్న కారు బలంగా వీరి బైక్‌ను ఢీకొట్టింది. దాంతో మహేష్ తలకు బలమైన గాయం కాగా చైతన్యకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అక్కడ స్థానికులు ప్రథమ చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ మహేష్(31) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడంతో భార్య రోదనలు మిన్నంటాయి.

చికిత్స పొందుతూ..

వేపాడ: మండలంలోని కుమ్మపల్లి జంక్షన్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాల పాలైన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వల్లంపూడి ఎస్‌ఐ బి.దేవి తెలిపిన వివరాలు.. కె.కోటపాడు మండలం కొరువాడ గ్రామానికి చెందిన పింగంపల్లి రాము(57) వేపాడ మండలం కుమ్మపల్లి జంక్షన్‌లో ఉండగా కొత్తవలస నుంచి వస్తున్న ద్విచక్ర వాహనచోదకుడు బస్సును ఓవర్ టాయక్ చేస్తూ రామును ఢీకొట్టాడు. దీంతో రాము తీవ్రంగా గాయపడ్డాడు. రామును విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య సింగంపల్లి కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.